# తిరుగులేని సాక్ష్యం

– 'రాంబో'




ఓ ప్రైవేట్ పనిమీద కలకత్తాకి వచ్చిన డిటెక్టివ్ రుద్రనేత్ర పని ముగించుకుని షాపింగ్‌కి బయల్దేరాడు. అక్కడి చైనా బజారులో విదేశీ ఎలెక్ట్రానిక్ గూడ్స్ కారుచౌకగా దొరుకుతాయి.

అక్కడ తనకోసం కావాల్సిన వస్తువుల గురించి అసిస్టెంట్ లత ముందే డిటెక్టివ్‌కి పెద్ద లిస్టు ఇచ్చి వుంది. అందులో ముఖ్యమైనవి ఓ మేకప్ బాక్స్, ఓ టూ ఇన్ వన్, ఓ ట్రిక్ గేమ్ సెట్ కొనుక్కుని తన బ్యాగ్‌లో వేసుకున్నాడు.

తర్వాత రైల్వేస్టేషన్ చేరుకుని మద్రాస్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. ఫస్ట్ క్లాస్ బోగీలో ముందే రిజర్వ్ చేసుకున్న తన సీట్లో వాలి అలసటగా కళ్ళు మూసుకున్నాడు.

ట్రైన్ కదులుతుండగా ఓ అందాల రాశి హడావిడిగా బోగీలోకి ఎంటరై అతని ఎదుట సీట్లో కూర్చుంది. డిటెక్టివ్ రుద్రనేత్ర కళ్ళు తెరిచి ఆమె వైపు తేరిపార చూశాడు.

పాతికేళ్ళ విందు యవ్వనంతో పిటపిట లాడుతున్న ఆ అందాల రాశి అతన్ని చూసి పలకరింపుగా నవ్వింది. "ఏమిటలా చూస్తున్నారు మిస్టర్ డిటెక్టివ్ రుద్రనేత్ర?" అంది.

"మిస్...నా పేరు నీకెలా తెలుసు?"

ఆమె మనోహరంగా నవ్వింది. "తెలివి తేటలు మీ ఒక్కరి సొత్తే అనుకున్నారా? డిటెక్షన్ చేయటం నాకు వచ్చు. ట్రైన్ ఎక్కక ముందైతే మీరెవరో నాకు అసలు తెలీదు. కాని మీరు డిటెక్టివ్ అని ఇప్పుడే తెల్సింది"

"యు ఆర్ ఎ షార్ప్ గర్ల్. నువ్వు డిటెక్టివ్ వృత్తిలో వుండవలసింది."

"థాంక్యూ" ఆమె గర్వంగా అంది. "చిన్నప్పట్నుంచి డిటెక్టివ్ నవల్స్ చదవటంవల్ల నా బ్రెయిన్ బాగా షార్పయింది. నేను మీ వృత్తి చేపట్టానంటే మీరంతా ఇళ్ళకు వెళ్ళవల్సిందే."

రుద్రనేత్ర ఖంగుతిన్నాడు "మిస్...మరీ అంత ఓవర్ కాన్ఫిడెన్స్ వుండటం మంచిది కాదు. ఇతరుల్ని అంత తక్కువగా అంచనా వేయకండి."

"అఫ్‌కోర్స్!" ఆమె నిర్లక్ష్యంగా చెప్పింది "ఇప్పుడు నేను తల్చుకుంటే ఇదే క్షణం మిమ్మల్ని ఇబ్బంది పాల్జేయగలను."

"అదెలా?" రుద్రనేత అర్థం కానట్లు అడిగాడు.

"చాలా సులభం. ఈ క్యాబిన్‌లో మనం తప్ప మరెవరూ లేరు. నేను వయసులో వున్న ఆడపిల్లను. మీరు వయస్సులో వున్న మగవారు. నేను బట్టలు చింపుకుని ఏడుస్తూ కేకలు వేశానంటే జనం ట్రైన్ ఆపుతారు. మీరు నన్ను రేప్ చేయబోయారని మీపై నిందవేస్తే జనం మిమ్మల్ని పోలీసులకు పట్టిస్తారు. మీరు నిర్దోషి అని నిరూపించుకోవటం అసాధ్యం."

రుద్రనేత్ర మందహాసం చేశాడు. "బేబీ, నువ్వు చెబుతున్నది వింటుంటే నాకో పాత డిటెక్టివ్ కథ గుర్తొస్తోంది. అందులో ఇలాగే ఓ వ్యక్తిని నీలాంటి నెరజాణ బ్లాక్ మెయిల్ చేస్తుంది. ఆ వ్యక్తి నాలాగే ట్రైన్‌లో జర్నీ చేస్తూ చలికి తట్టుకోలేక నిండా కోటు కప్పుకుని వుంటాడు. ఆ పిల్ల నీవు చెప్పినట్లుగానే బట్టలు చింపుకుని కేకలు వేస్తూ పోలీసుల్ని పిలుస్తుంది. పోలీసులు వచ్చాక ఆమె కోటు వ్యక్తి తనపై అత్యాచారం చేయబోయాడని నింద మోపుతుంది. పోలీసులు ఆ వ్యక్తిని కస్టడీలోకి తీసుకోవాలని అతన్ని పట్టుకోగానే అతని ఒంటిపై వున్న కోటు జారిపోతుంది. అప్పుడా వ్యక్తి అసలు రూపం పోలీసుల కంట పడుతుంది. అతనికి రెండు చేతులూ వుండవు. దాంతో ఆ నెరజాణ నచ్చి అబద్ధం చెప్పిందని గ్రహించిన పోలీసులు ఆగ్రహంతో ఆమెనే అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపిస్తారు."

"ఎక్స్‌లెంట్...కథ బాగుంది. అయితే ఆ వ్యక్తికి చేతులే గనక వుండివుంటే పోలీసులు ఆ అమ్మాయి మాటల్నే నమ్మి వుండే వారు. ఇక్కడ మీకు అవకాశం లేదు. మీ బలమైన చేతులు నాకు

కనిపిస్తూనే వున్నాయి.

"అఫ్‌కోర్స్...చేతులతోపాటు నా బుర్ర కూడ అమోఘంగా పని చేస్తోందనుకో. అయితే నీకు మరో నీతి కథ చెప్తా విను.

ప్రఖ్యాత డిటెక్టివ్ షెర్లాక్ హోమ్స్ ఓసారి ఇలాగే ట్రైన్ ప్రయాణం చేస్తుండగా నీలాంటి యువతి అతన్నిలాగే బెదిరించింది. షెర్లాక్ హోమ్స్‌కి సిగార్ తాగే అలవాటుంది. ఆ యువతి ట్రైన్ ఎక్కడానికి అరగంట ముందునుంచే అతను సిగార్ తాగుతుంటాడు. సిగార్ తాగటంలో అతనికి ఓ వింత అలవాటు వుండేది. గంట వరకు సిగార్ నుసి కింద పడ కుండా జాగ్రత్తగా అతను సిగార్‌ను వేళ్ళమధ్య బిగించి పట్టుకునేవాడు. యువతి బట్టలు చింపుకుని కేకలు వేసినప్పుడు పోలీసులు వచ్చినప్పుడు కూడా అతను నింపాదిగా సిగార్ పీలుస్తూనే కూర్చున్నాడు. తాను తన సీట్లోంచి కదల్లేదని నిరూపించటానికి అతను తన సిగార్‌లో పోగైన నుసిని పోలీస్ ఆఫీసర్‌కి చూపించాడు. ఆ ఆఫీసర్‌కి కూడా సిగార్ అలవాటుండేది. షెర్లాక్ హోమ్స్ సిగార్‌లోగల నుసిని బట్టి అతను గంట నుంచి సిగార్ పీలుస్తున్నాడని, సిగార్‌ని ఏమాత్రం కదిలించి వున్నా లేక నేలమీద పెట్టివున్నా ఆ నుసి రాలిపోయి వుండేదని పోలీస్ ఆఫీసర్ గ్రహించాడు. అలా సిగార్‌లో నుసి రాలకుండా ఓ యువతిపై బలాత్కారయత్నం చేయటం అసంభవం గనక ఆ పిల్ల నాటకమాడుతోందని గ్రహించి ఆమె చేతులకు బేడీలు వేశాడు."

"సూపర్బ్...ఈ కథ అద్భుతంగా వుంది. అయితే ఇప్పుడు మీరు సిగార్ లాంటిదేం తాగటం లేదు. మీరు నిర్దోషి అని నిరూపించుకోవటం అసాధ్యం" అందామె ఛాలెంజ్‌గా.

"నిజమే సుమా, నాకు సిగార్ అలవాటు లేదుగాని సిగరెట్ అలవాటుంది" అంటూ రుద్రనేత్ర కాళ్ళవద్దగల బ్యాగు తెరిచి కాస్సేపు తడిమి చివరికి ఓ సిగరెట్ ప్యాక్ బయటికి తీసి సిగరెట్ వెలిగించాడు.

ఆ యువతి అతనివైపు పరిశీలనగా చూస్తూ అడిగింది. "మీరు ఓడిపోయినట్టు ఒప్పుకుంటారా లేక డ్రామా మొదలెట్టి మీ పరువు తీయమంటారా?"

"నీ ఇష్టం. నీకు కటకటాలపై అంతగా మోజు వుంటే నీ డ్రామా మొదలెట్టు. అంత వరకు నేను కునుకు తీస్తాను" సిగరెట్ పొగ పీలుస్తూ ఎగతాళిగా అన్నాడు రుద్రనేత్ర.

"మీ తెలివితేటల మీద మీకు గొప్ప నమ్మకమున్నట్టుంది. కాని మీకంటే నేనే తెలివైన దాన్నని ఇప్పుడే రుజువు చేస్తాను. కాచుకోండి" అంటూ రోషంగా లేచిందామె. తర్వాత తన ఒంటిపై బట్టల్ని అక్కడక్కడ చింపుకుంది. ఆ తర్వాత "రక్షించండి...రక్షించండి. ఈ మనిషి నన్ను బలవంతం చేస్తున్నాడు...కాపాడండి" అంటూ కిటికీ కాబిన్ డోర్ వేసి గట్టిగా కేకలు వేయటం మొదలెట్టింది.

ఆమె కేకలు విని పక్క క్యాబిన్‌లోని ప్రయాణీకులు పరిగెత్తుకుని వచ్చారు. ఎవరో చైన్ లాగటంతో ట్రైన్ ఆగిపోయింది. కాస్సేపట్లో రైల్వేగార్డ్, సెక్యూరిటీ ఆఫీసర్ కూడా అక్కడికి చేరుకున్నారు.

"ఏమైంది మిస్" ఆ యువతిని అడిగాడు సెక్యూరిటీ ఆఫీసర్.

ఆ యువతి ఏడుస్తూ చెప్పింది "ఈయన పెద్ద మనిషి అనుకుని ఇక్కడ కూర్చున్నాను సార్. ఎవరూ లేరని ధైర్యంతో నన్ను బలవంతం చేయబోయాడు. చూడండి, నా బట్టలు ఎలా చింపేశాడో, మీరే గనక రాకపోయివుంటే నా జీవితం నాశనమై వుండేది" అంటూ వెక్కి వెక్కి ఏడవటం మొదలెట్టింది.

"ఏమ్ మిస్టర్? ఈమె చెప్పింది నిజమేనా?" రుద్రనేత్రని గద్దిస్తూ అడిగాడు సెక్యూరిటీ ఆఫీసర్.

రుద్రనేత్ర తల అడ్డంగా వూపాడు. "ఈమె తన తెలివితేటలు ప్రదర్శించటానికి ఆడిన నాటకం సార్ ఇది. అసలు నేనామెని తాకనే లేదు. ఆమె తనంతట తాను బట్టలు చింపుకుని కేకలు వేసింది" అన్నాడు.

"వ్వాట్? ఆమె నాటకమాడుతోందా? ఆ సంగతి కోర్టులో చెప్పుకో! క్యాబిన్‌లో మీరిద్దరు తప్ప మరెవరూ లేరు. ఆమె బట్టలు అస్తవ్యస్తంగా వున్నాయి. ఈ సాక్ష్యాధారాలు చాలు నిన్ను అరెస్టు చేయడానికి" సెక్యూరిటీ ఆఫీసర్ మొండిగా అన్నాడు.

"ఆమె చెప్పిందంతా అబద్ధమని నేను నిర్దోషి అని రుజువు చేయటానికి నావద్ద కూడా ఓ తిరుగులేని సాక్ష్యాధారం వుంది చూస్తారా?" రుద్రనేత్ర అడిగాడు.

"ఏమిటది?" సెక్యూరిటీ ఆఫీసర్ అడిగాడు.

డిటెక్టివ్ రుద్రనేత్ర ఆ సాక్ష్యాధారం ఏమిటో చూపించాడు. అది చూసి ఆ యువతి ముఖం తెల్లగా పాలిపోయింది. సెక్యూరిటీ ఆఫీసర్ ఆ యువతిని సమీపించి "ఓ పెద్దమనిషి పరువు తీసినందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాను" అన్నాడు. ఊహించని పరిణామానికి ఆమె షాక్‌తో స్పృహ తప్పింది.

డియర్ రీడర్స్, ఇంతకీ డిటెక్టివ్ రుద్రనేత్ర తను నిర్దోషి అని నిరూపించుకోటానికి చూపిన సాక్ష్యాధారమేమిటి? కథ మొదట్నుంచి క్షుణ్ణంగా చదివితే జవాబు ఇట్టే చెప్పవచ్చు. చెప్పకోండి చూద్దాం!

(జవాబు వచ్చే సంచికలో)

**తెల్లమచ్చలు**

అత్యంత శీఘ్రంగా, ప్రభావశీలియైన మందుతో తెల్ల మచ్చరంగు మారి, నెమ్మదిగా శరీరంలో మచ్చ లేర్పడు కారణం దూరం చేస్తూ, కల్సిపోవును. పరీక్షించుటకు 7 రోజుల మందు ఉచితంగా పంపుతాము. ఇతర వైద్యాలతో నిరాశ చెందినచో, మాకు రోగి వయస్సు మచ్చల వివరాలతో వ్రాయండి.

**జుట్టు తెల్లబడుట, రాలుట**

చిరుప్రాయంలో జుట్టు రాలుట, తెల్లబడుటను నివారించుటకు, విలువైన వన మూలికలతో చేయబడిన మందు కలదు. నల్లని ఒత్తైన జుట్టు దట్టంగా పెరిగి, జ్ఞాపకశక్తి పెరిగి మెదడును చల్లబర్చును. రోగి వయసు, వివరాలతో వ్రాయండి.

**జ్ఞాపకశక్తి**

మేము తయారుచేసి ఇచ్చు మందుల వల్ల మెదడు, తల, కళ్ళు చల్లగా యుండి, జ్ఞాపకశక్తి పెరిగి, విద్యార్థి చురుకుగా ఉండును.

వాత రోగం, మధుమేహం లావు తగ్గుట, ఇతర చర్మరోగములు, స్త్రీ పురుష అనారోగములకు సంపూర్ణ చికిత్స కొరకు వివరములుగా వ్రాయండి.

**GAYA AYURVED BHAVAN (GB-3)**

**P.O. KATRI SARAI ( GAYA ) - 805 105**